

# మహాభారతం 6

## ఏకలవ్యుడు

రచన:
మహాభారత పరిశోధకులు
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.,(Ag)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్ : 08647 254716.

(గత సంచిక తరువాయి)

మహాభారతంలో అనేక విమర్శలకు, అపోహలకు, అపార్థాలకు, అనర్థాలకు దారితీసిన సంఘటన ఏకలవ్యునికి సంబంధించిన గాథ.

సంస్కృత మూలభారతంలో ఆదిపర్వం 131వ అధ్యాయంలో 31 నుండి 60 వరకు గల 30 శ్లోకాలలో మాత్రమే ఈ ఏకలవ్యుని వృత్తాంతం చెప్పబడింది. ఇదిగాక మహాభారతంలో ఏకలవ్యుని ప్రసక్తి మరెక్కడా లేనేలేదు. ఈ ఏకలవ్యుని గాథపై ఉన్న విమర్శలేమిటో చూద్దాం.

### ఏకలవ్య వృత్తాంతంపై గల విమర్శలు

(1) **మ. అకటా! ద్రోణుని మట్టిబొమ్మకడ విద్యాస్వీకృతిం జెంది నం
దుకు పార్థుండల యేకలవ్య నిషాదుం జూచి మన్నింపనో
పక యంగుష్ఠము గోరి కొమ్మనియె జాపాచార్యునిన్ మత్స్యగం
ధికుమారా! కురురాజు స్వార్థపరుడౌనె క్రీడితో బోల్చినన్**

అని కవిత్వం అల్లి తన తెలివిని ప్రదర్శించాడొక కవి, ఖండకావ్యములోని 'చనవు' అనే ఒక పుస్తకంలో. ఈ పద్యం యొక్క అర్థం ఏమంటే, ఓ వ్యాసమహర్షీ! ద్రోణాచార్యుని మట్టిబొమ్మ వద్ద విద్యలు నేర్చినందుకు సహించలేక అర్జునుడు ఆ ఏకలవ్యుని వ్రేలు కోరుకోమని ద్రోణునికి చెప్పాడే, ఆహా! ఆ అర్జునుని వంటి స్వార్థపరుడా దుర్యోధనుడు? అని.

ఇందులోని కవి విమర్శలు ఏమంటే అర్జునుడు ఏకలవ్యుని జూచి అసూయచెందాడనుట, అర్జునుడే ఏకలవ్యుని వ్రేలును గురుదక్షిణగా కోరమని ద్రోణునికి సలహా ఇచ్చాడనుట, అర్జునుడు స్వార్థపరుడు, దుర్యోధనుడేమో స్వార్థమనేది తెలియని నిస్వార్థజీవియనుట– ఇవి ఈ కవి యొక్క భావాలు. ఇది ఒక కవి యొక్క విమర్శ.

(2) ఎంతో ఆశతో విద్యనర్థించి వచ్చిన ఏకలవ్యునికి, విద్యను బోధించకపోవటం ద్రోణాచార్యుని ఒక తప్పుకాగా, గురుదక్షిణగా అతని వ్రేలిని కోసి ఇమ్మనటం మరొక పెద్ద తప్పు. చేతనైతే అర్జునునికి గొప్పగా విద్యలు చెప్పుకోవచ్చు గాని, ఏకలవ్యునికి అన్యాయం చేయటం ఎలా ధర్మమవుతుంది? అని లోకంలో చాలామంది విమర్శిస్తూ ఉంటారు.

(3) ఏకలవ్యుని గాథను విన్నవారు అతడిపై సానుభూతితో, "ఆ ఏకలవ్యుడు అమాయకుడు గనుక, తెలివిలేక, అడిగినదే తడవుగా ద్రోణాచార్యునికి వ్రేలు కోసి ఇచ్చి పొరపాటుచేశాడు. అసలలా వ్రేలు ఇవ్వాల్సిన పనేమిటి?" అంటారు కొందరు.

ఈ విమర్శల సుడిగాలిలో పడిపోయి, అసలు ఈ ఏకలవ్య వృత్తాంతం ద్వారా, మానవుడు తెలుసుకోవలసిన జీవన సత్యాలేమిటో, ధర్మసూక్ష్మాలేమిటో, నీతి ఏమిటో మరుగున పడిపోయినవి. కనుక మనం పైవిమర్శలలోని నిజానిజాలేమిటో, ఈ వృత్తాంతంలోని ధర్మాధర్మాలేమిటో, ధర్మసూక్ష్మాలేమిటో, మనం నేర్చుకోవలసిన జీవన సత్యాలేమిటో తెలుసుకొనేముందు మహాభారతంలోని ఈ ఏకలవ్య గాథను ఉన్నది ఉన్నట్లుగా తెలుసుకుందాం.

**ఏకలవ్య చరిత్ర (ఆదిపర్వం 131 అ.31-60శ్లో)**

ఏకలవ్యుడు నిషాదరాజు 'హిరణ్యధను' కుమారుడు. అతడు

ధనుర్విద్యను నేర్చుకొనుటకు ద్రోణుని వద్దకు వచ్చాడు. అతడు నిషాదుడు గనుక ధనుర్విద్యను నేర్పేందుకు నిరాకరించాడు ద్రోణాచార్యుడు. ఏకలవ్యుడు ద్రోణుని పాదాలకు శిరస్సువంచి నమస్కరించి, వనాలకు తిరిగివెళ్ళి, ద్రోణుని మట్టి విగ్రహాన్ని తయారుచేసుకొని, అందులోనే గురువును దర్శిస్తూ ధనుర్విద్యా భ్యాసం ప్రారంభించాడు. ఆచార్యునియందు అచంచలమైన శ్రద్ధ గలవాడై, ఏకలవ్యుడు గొప్ప అభ్యాసబలం చేత ధనుస్సుకు శరాన్ని సంధించటంలోను, శరప్రయోగంలోను అత్యంత నైపుణ్యాన్ని సాధించాడు. (31-35శ్లో)

అంతట ఒకనాడు కౌరవపాండవులంతా కలిసి ఆచార్య ద్రోణుని అనుమతిని తీసుకొని, రథాలనధిరోహించి, వేటాడుటకై వనాలకు బయలుదేరారు. పాండవుల వెంట ఒక కుక్క కూడా ఉన్నది. వారంతా వేటలో మునిగి అటూ ఇటూ పరుగులు తీస్తున్న వేళ, పాండవుల వెంట వచ్చిన కుక్క తిరుగుతూ, తిరుగుతూ, శరప్రయోగ అభ్యాసం చేస్తున్న ఏకలవ్యుని సమీపానికి వచ్చింది. మృగచర్మాన్ని ధరించి, నల్లని మేనిరంగుతో, జటాజూటంతో, దుర్గంధభూయిష్టమైన శరీరంతో ఉన్న ఏకలవ్యుని జూచి, ఆ కుక్క మొరుగుతూ అతని ఎదుట నిలిచింది. ఇది చూచి తన శరలాఘవాన్ని ప్రదర్శించుటకై ఏకలవ్యుడు, ఆ మొరుగుతున్న కుక్క నోటిలో 7 బాణాలను ఒక్కటిగా నాటాడు. దానితో ఆ కుక్క నోటిలోని బాణాలతో సహా పాండవులున్న చోటకు పరుగుతీసింది.

రాజపుత్రులంతా ఆ కుక్కవైపు దృష్టిసారించి, ఆ బాణ ప్రయోగ కౌశల్యానికి, శబ్దాన్ని అనుసరించి లక్ష్యాన్ని ఛేదించటం లోని నైపుణ్యానికి, ఆశ్చర్యచకితులై అనేకవిధాల ప్రశంసించారు. అంత పాండవులందరూ ఆ కుక్క వెంట ఆ వీరుని వెదుకుతూ వెళ్ళి, నిరంతర బాణప్రయోగ అభ్యాసం చేస్తున్న విచిత్రవ్యక్తిని చూచారు. అతడి రూపం, వాలకం చూచి, అతడే ఈ వీరుడని గుర్తించలేక, "నీవెవరు? ఎవని పుత్రుడవు? అని అడుగగా, ఏకలవ్యుడు, "నేను హిరణ్యధనువను నిషాదరాజకుమారుడను, ఏకలవ్యుడను, ద్రోణాచార్యుని శిష్యుడను, ధనుర్వేదమునందు విశేష పరిశ్రమ చేస్తున్నాను" అన్నాడు. అది విని, పాండవులు తిరిగివచ్చి, వనంలో జరిగిన ఆ అద్భుత ఘటనను ద్రోణాచార్యునకు వివరించారు. (36-46శ్లో)

అర్జునుడు ఆ ఏకలవ్యుని అద్భుత బాణప్రయోగ కుశలతను స్మరిస్తూ ఒకనాడు ఏకాంతంలో ద్రోణాచార్యుని కలిసి ఇలా అన్నాడు.

**శ్లో॥ తదాహం పరిరభ్యైక ప్రీతిపూర్వమిదం వచః ।**
**భవతోక్తో నమే శిష్యః తద్విశిష్టో భవిష్యతి ॥** (48శ్లో)

ఆచార్యా! ఆనాడు మీరు నన్ను హృదయానికి హత్తుకొని, "నా శిష్యులలో నిన్ను మించినవాడుండడు" అని ప్రీతి పూర్వకంగా మాట ఇచ్చారు.

కానీ, నాకన్నా విశిష్టుడైన శక్తిశాలి, నిషాదరాజు పుత్రు డొకరు మీ శిష్యుడైయున్నాడు గదా!" అన్నాడు.

ఈ మాట విని ద్రోణుడు రెండు ఘడియలు ఆలోచించి, అర్జునుని వెంటబెట్టుకొని అతడివద్దకు వెళ్ళాడు. నిరంతర ధనుర్విద్యాభ్యాసం చేస్తున్న ఏకలవ్యుని చూచాడు. అదే సమయంలో తనవైపుగా వస్తున్న ద్రోణాచార్యుని చూచి ఏకలవ్యుడు, పరుగుపరుగున ఎదురువెళ్ళి, ఆచార్యుని పాదాలపై తన శిరస్సునానించి నమస్కరించాడు. శిష్యునిగా ద్రోణుని పాదాలను విధిపూర్వకంగా పూజించి, చేతులు జోడించి ఆయన సమీపంలో నిలుచున్నాడు.

అప్పుడు ద్రోణాచార్యుడు ఏకలవ్యునితో "యది శిష్యోఽసిమే వీర వేతనం దీయతాం మమ, నీవు నా శిష్యుడివే అయితే నాకు గురుదక్షిణనిమ్ము" అన్నాడు. అది విని ఏకలవ్యుడు ఎంతో సంతోషించి, "మహాత్మా! నేను మీకేమి ఇవ్వగలను? ఈ విషయంలో గురుదేవులే నన్ను ఆజ్ఞాపించాలి. గురుదేవునికి ఇవ్వదగిన వస్తువేదీ నా వద్ద లేదు- అన్నాడు. అంతట ద్రోణుడు "నీ కుడిచేతి బొటనవ్రేలును ఇమ్ము" అన్నాడు.

ద్రోణాచార్యుని ఈ దారుణ వచనములు విని, సత్య వాదియైన ఏకలవ్యుడు, పూర్వంలాగే ప్రసన్నచిత్తంతోను, అత్యంత ఉదార స్వభావంతోను, ఏమాత్రం ముందువెనుకలు ఆలోచించకుండా, తన కుడిచేతి బొటనవ్రేలును కోసి, ద్రోణాచార్యునికిచ్చి తన ప్రతిజ్ఞను నిలుపుకున్నాడు. ఏకలవ్యుని గురుభక్తికి, సత్యప్రతిజ్ఞకు సంతసించిన ద్రోణాచార్యుడు నీవు ఇకపై శరసంధానం ఇలా చేయవలసినది అని తర్జనీ మధ్యమాంగుష్టము చేత (చూపుడు వ్రేలు, మధ్యవ్రేలుతో) శరప్రయోగం చేసే విధాన్ని తెలియజేశాడు. అప్పటినుండి ఏకలవ్యుడు అలాగే శరసంధానం చేస్తున్నాడు. అయినా పూర్వంలాగా బాణప్రయోగం చేయలేకపోతున్నాడు. దీనితో

ద్రోణుడు పూర్వం అర్జునుని కొరకు తాను చేసిన ప్రతిజ్ఞను నిలబెట్టుకున్నాడు. (54-60శ్లో)

ఇదీ లక్షశ్లోకాల మహాభారత గ్రంథంలో 30 శ్లోకాలలో మాత్రం చెప్పబడిన ఏకలవ్య వృత్తాంతం. ఇదిగాక ఎక్కడా ఏకలవ్యుని ప్రసక్తే లేదు. గ్రంథంలో ఉన్న ఏకలవ్యుని వృత్తాంతం మొత్తం ఇలా చెప్పబడగా, ఇక ఈ విమర్శకుల ధోరణి ఎలా ఉన్నదో చూడండి-

## విమర్శలు

**విమర్శ:(1)** అర్జునుడు ఏకలవ్యుని జూచి అసూయ చెందాడట. ఏకలవ్యుని వ్రేలును కోరమని అర్జునుడే ద్రోణాచార్యునికి చెప్పాడట. దుర్యోధనుడు అర్జునునిలాగా స్వార్థపరుడు గాదట. ఇదీ కవిగారి చమత్కారం.

అర్జునుడు ఏకలవ్యుని జూచి అసూయ చెందినట్లు గ్రంథంలో ఎక్కడైనా ఉన్నదా? లేదు. పైగా అ బాణప్రయోగ కౌశల్యానికి ఆశ్చర్యచకితులై ప్రశంసించినట్లుగా ఉన్నది. ఇదిగో ఆ శ్లోకం.

**శ్లో॥ లాఘవం శబ్దవేధిత్వం దృష్ట్వా తత్ పరమం తదా।**
**ప్రేక్ష్యతం వ్రీడితాశ్చాసన్ ప్రశంస సుశ్చ సర్వశః॥** (ఆది 131 శ.42)

కనుక అర్జునునికి ఏ అసూయా లేదు. ఉంటే అది కవిగారి మనసులో ఉండాలి.

ఇక ఏకలవ్యుని వ్రేలిని కోరమని అర్జునుడే ద్రోణాచార్యునికి చెప్పాడట. ఇది కూడా గ్రంథంలో ఉన్నదానికి విరుద్ధంగా చెప్పటమే. అర్జునుడేమన్నాడు ద్రోణాచార్యునితో? "ఆచార్యా! ఆనాడు మీరు నన్ను హృదయానికి హత్తుకొని, నా శిష్యులలో నిన్ను మించిన వాడుండడు" అని ప్రీతిపూర్వకంగా మాట ఇచ్చారు. కాని నా కన్నా విశిష్టుడైన శక్తిశాలి, ఏకలవ్యుడను వాడొకడు మీ శిష్యుడైయున్నాడు గదా!" అని మాత్రమే.

ఈ విషయం ఇంతకు ముందు శ్లోకం(48)తో సహా ఏకలవ్య వృత్తాంతంలో చెప్పబడింది. దీనినిబట్టి కవిగారి మాట ఎంత అబద్ధమో, కల్పితమో, అర్జునునిపై ఎంతటి ద్వేషమో తెలుస్తూనే ఉంది. అర్జునుడు అలా ద్రోణాచార్యునికి ఏకలవ్యుని గురించి ఎందుకు చెప్పాల్సివచ్చింది? ద్రోణాచార్యుడు అంతకు ముందు అర్జునునికి చేసిన ప్రతిజ్ఞ కారణంగానే. ద్రోణాచార్యుడు ఆ ప్రతిజ్ఞ నెందుకు చేశాడు?

ద్రోణాచార్యుడు కౌరవపాండవులను శిష్యులుగా స్వీకరించిన తర్వాత ఒకనాడు వారితో, "నాయనలారా! నేను కోరుకుంటున్నట్టి, నా హృదయాన్ని కలతచెందించుచున్నట్టి కార్యం ఒకటి ఉన్నది. అస్త్రవిద్యాభ్యాసం పూర్తి అయిన తర్వాత మీరు నా కోరికను నెరవేర్చాలి. ఈ విషయంలో మీ నిశ్చయం ఏమిటో చెప్పండి" అనగా కౌరవులందరూ మౌనం వహించగా, అర్జునుడు మాత్రం "మీ ఆజ్ఞప్రకారం నేనా కార్యాన్ని నెరవేర్చగలను" అని ఆచార్యునికి వాగ్దానం చేశాడు.

అపుడు ద్రోణుడు వాత్సల్యంతో అర్జునుని కౌగిలించుకొని, శిరస్సు మూర్కొని ఆనందించాడు. ఆ తరువాత మిగిలిన అందరి కన్నా ఎంతో శ్రద్ధతో అస్త్రవిద్యాభ్యాసం చేస్తున్నాడు అర్జునుడు. అంతేగాదు-

**శ్లో॥ అర్జునః పరమం యత్నం అతిష్టద్ గురుపూజనే।**
**అస్త్రే చ పరమం యోగం ప్రియోద్రోణస్య చాऽభవత్॥** (ఆది 131-20శ్లో)

-అర్జునుడు గురుదేవుల పూజ, సేవలకొరకు తీవ్ర ప్రయత్నం చేయుటే గాక, అస్త్రవిద్యాభ్యాసమందు కూడా విశేష కృషి చేస్తూ ఆచార్యునకు ప్రియశిష్యుడైనాడు.

ఇదిలా ఉండగా, ఒకనాడు రాత్రి సమయమున అర్జునుడు భోజనం చేస్తుండగా, గాలివీచి దీపం ఆరిపోయింది. అయినప్పటికీ ముద్ద నోట్లోకే పోయింది. ఇదంతా అభ్యాస విశేషం చేతనే గదా! అని భావించి, రాత్రియందుమాత్రం ఎందుకు బాణప్రయోగ అభ్యాసం చేయకూడదు? అని నిశ్చయించి, ఆనాటినుండి రాత్రిపూట చీకటిలో శరప్రయోగాన్ని అభ్యాసం చేస్తున్నాడు అర్జునుడు.

ఆ బాణప్రయోగ శబ్దాన్ని విని, ఒకనాటి రాత్రి నిద్రిస్తున్న ద్రోణాచార్యుడు లేచి, ఆ శబ్ధం వచ్చిన దిక్కుగా వెళ్ళి, విషయం గ్రహించి, అర్జునుని కౌగిలించుకొని "అర్జునా! లోకంలో నీతో సమానుడైన ధనుర్ధరుడు నా శిష్యులలో మరొకడు లేడనునట్లు చేస్తాను, ఇది నిజం" అన్నాడు.

ఇలా ప్రతిన జేయటానికి కారణం అర్జునుని గురుభక్తి, గురుకార్య నిర్వహణకై చేసిన ప్రతిజ్ఞ, అస్త్ర విద్యాకౌశల్యం, అసాధారణ బుద్ధికుశలత వల్ల కలిగిన శిష్యవాత్సల్యమే. కనుక ద్రోణుని ప్రతిజ్ఞను బట్టియే ఏకలవ్యుని విషయం అర్జునుడు చెప్పవలసివచ్చిందే తప్ప అసూయతో కాదు, వ్రేలును కోరమనీ చెప్పలేదు. అయినప్పుడు "అంగుష్ఠము కోరుకొమ్మనియె చాపాచార్యునిన్" అన్న కవిమాట ఎంత అబద్ధం? గ్రంథంలో

లేని మాటను ఇలా కల్పించి చెప్పటం గ్రంథాన్నెవరూ చూడరనే సాహసమా? లేక కవిగారి గ్రంథ పరిజ్ఞానం అంతేనా?

దుర్యోధనుడు అర్జునునిలాగా స్వార్థపరుడుగాడట, మరి ఎంతటి నిస్వార్థజీవియో చూద్దాం. మహాభారతం దుర్యోధను డెలాంటి వాడని చెబుతున్నదో చూద్దాం.

కురుపాండవులు ఆటలాడుకునే సమయంలోనే, భీముడు అందరిలోనూ బలవంతుడని గ్రహించిన దుర్యోధనుడు, తమ్ములతో ఆలోచిస్తూ, "నిద్రించే సమయంలో భీముని బంధించి గంగలో త్రోసేద్దాం, ఆ తర్వాత అర్జున ధర్మజులను జైలులో పెట్టి, ఈ సమస్త రాజ్యాన్నీ పాలిస్తాను" అని పాప బుద్ధితో ఉన్నవాడు దుర్యోధనుడు. ఆటలాడుకునే వయస్సులోనే రాజ్యంపై కన్ను వేసిన పాపాత్ముడు నిస్వార్థజీవియట. ఇదిగో ఆ శ్లోకం. "ప్రసహ్యాబంధనే బద్ధ్వా ప్రశాసిష్యే వసుంధరాం" (127-30)

ఇక విద్యాభ్యాసం పూర్తయి, కుమారాస్త్రవిద్యా ప్రదర్శనా నంతరం ఒక సంవత్సరానికి ధృతరాష్ట్రుడు ధర్మరాజును యౌవరాజ్యాభిషిక్తునిగా చేయ, దుర్యోధనుడది సహించలేక, తండ్రివద్దకు వచ్చి, తన ఆవేదననిలా తెలియజేశాడు.

**శ్లో॥ పితృతః ప్రాప్తవాన్ రాజ్యం పాండురాత్మ గుణైః పురా।**
**త్వమంధ గుణసంయోగాత్ ప్రాప్తం రాజ్యం నలబ్ధవాన్॥** (ఆది 140-34)

నీవు అంధుడవు కావటం వల్ల ఈ రాజ్యాన్ని పొంద లేకపోతివి, తన సద్గుణముల వల్ల వారసత్వంగా పాండురాజు ఈ రాజ్యాన్ని పొందాడు. ఇపుడు ధర్మరాజును యువరాజుగా చేశావు. ఆ తర్వాత అతడు రాజవుతాడు. ఆ తర్వాత అతని కుమారుడు, అలా పరంపరగా వారే రాజ్యాధికారులవుతారు. మేము రాజ్యాధికారానికి దూరమై అవహేళనపాలు కావల్సిందేనా? నీవే ముందుగా రాజువైయుంటే లోకులు ఎంత ప్రతికూలురుగా ఉన్నా, వారసత్వంగా ఈ రాజ్యం మాకే వచ్చేది గదా! ఇది నేను సహించలేను. దీనికి ఏదో ప్రతి ఉపాయం ఆలోచించాలి అని చెబుతూ తానే ఉపాయం చెప్పాడు.

**శ్లో॥ పాండవేభ్యో భయం నస్యాత్ తాన్ వివాసయతాం భవాన్।**
**నిపుణే నాభ్యుపాయేన నగరం వారణావతం** (ఆది 141-4)

తండ్రీ! పాండవులకు మేము భయపడకుండా ఉండాలంటే నీవు ఏదో ఒక గొప్ప ఉపాయంతో వారికి ఇక్కడినుండి వారణావతానికి పంపాలి. అని ఇలా తండ్రికి చెప్పిన దుర్యోధనుడు, ముందే పురోచనుని వారణావతం పంపి, అక్కడ లక్కఇంటి నిర్మాణం చేయించాడు. పాండవులను తల్లితో సహా లక్క ఇంటి అగ్నికి ఆహుతిచేయ తలపెట్టినవాడు దుర్యోధనుడు. ఇపుడు దుర్యోధనుని వయస్సు 30సం॥లు. భీముని అంతం చేయ తలపెట్టినది 16సం॥ల వయస్సులో. ఈ దుర్యోధనుడు నిస్వార్థపరుడట.

ఇక పాండవ రాజసూయానికి వెళ్ళి, వారి వైభవాన్ని తిలకించి, తిరిగివచ్చిన దుర్యోధనుడు వారి రాజసూయం తనకు అసూయాజనకమై, తీవ్రమనోవేదనకు గురియై, శకునితో ఏమన్నాడో చూడండి- "మానధనాఢ్యుడైన భూపతి సహియింప నోపునె సపత్నుల వృద్ధియు ఆత్మహానియున్" పాండవుల వృద్ధిని జూచి సహించలేకపోతున్నాడట. అందుకే "ఏమి సేయుదము. ఎవ్విధంబున పాండవుల లక్ష్మి మనకపహరించనగు" నని శకునిని అడుగుతున్నాడు. దానికి శకుని "నే నపహరించి ఇత్తు ధరానుత మాయదురోదర వ్యాజమునన్" మాయాజూదంతో వారి సంపదల నెల్ల హరించి ఇస్తానని చెప్పగా, తండ్రివద్దకు వెళ్ళి తన ఆలోచనను చెప్పాడు. ధృతరాష్ట్రుడు "ఇది అధర్మం, పెద్దలు అంగీకరించరు" అని చెప్పగా-

**శ్లో॥ లోకవృత్తాత్ రాజవృత్తం అన్యదాహ బృహస్పతిః।**
**తస్మాత్ రాజ్ఞాఽప్రమత్తేన స్వార్థశ్చింత్యస్సదైవహి** (సభా ప. 55అ. 6శ్లో)

**శ్లో॥ క్షత్రియస్య మహారాజ జయే వృత్తిః సమాహితా।**
**సవైధర్మ స్త్వ ధర్మోవా స్వవృత్తౌ కా పరీక్షణా॥** (సభా 55అ. 7శ్లో)

తండ్రీ! లోకవ్యవహారం వేరు, రాజ్యవ్యవహారం వేరు అని బృహస్పతి చెప్పాడు. కనుక రాజు అప్రమత్తుడై ఎల్లప్పుడూ స్వార్థచింతన చేస్తూ ఉండాలి. క్షత్రియునికి విజయం సాధించుట యందే దృష్టి ఉండాలి. అది ధర్మమైనా సరే, అధర్మమైనా సరే. తన ఆలోచనను సఫలం చేసుకోవటమే ముఖ్యం- అని స్వయంగా చెప్పినవాడు దుర్యోధనుడు.

ఇటువంటి దుష్టభావాలు కలిగినవాడు, పరులరాజ్యం కోసం, సంపదలకోసం సోదరులను చంపటానికి సిద్ధమైనవాడు, ధర్మాధర్మాల గురించి ఆలోచించకుండా తన ఆలోచనను సఫలం చేసుకోవాలనుకునేవాడు, స్వార్థచింతన చేస్తుండాలి అని చెప్పినవాడు కవికి నిస్వార్థపరుడుగా కనిపించాడు. ఇది దృష్టి లోపమే.

**(మిగిలిన విమర్శలు వచ్చే సంచికలో)**

**చదువుకున్నవాళ్ళు ఉన్నారు చాలామంది. చిత్తశుద్ధి ఉన్నవాళ్ళు ఎంతమంది ఉన్నారు?**

# మహాభారతం 7

## ఏకలవ్యుడు

రచన:
మహాభారత పరిశోధకులు
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc.(Ag)
వ్యవస్థాపకులు. ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్ : 08647 254716.



(గత సంచిక తరువాయి)

అర్జునుడు ఏకలవ్యుని జూచి అసూయచెందాడని, ఏకలవ్యుని వ్రేలును కోరమని ద్రోణునికి సలహా ఇచ్చాడని, దుర్యోధనుడు అర్జునునిలాగా స్వార్థపరుడు కాదని, గొప్ప నిస్వార్థజీవియని అడ్డదిడ్డంగా విమర్శించిన కవి వాక్కులు ఎంత అసత్యాలో, అభూతకల్పనలో, దుష్టబుద్ధి కలిగి, దుష్టకార్యాలు చేసేవారి పట్ల కవికి ఎంత అనురాగమో ఋజువు చేయటం జరిగింది. దుర్యోధనుడు ఎట్టి దుష్టుడో, ఎంతటి స్వార్థపరుడో అతడి నోటిమీదుగానే చెప్పిన మాటల ద్వారా ఋజువుచేయబడింది. ఇక రెండవ అంశాన్ని చూద్దాం.

### విమర్శ(2)

ఎంతో ఆశతో విద్యనర్థించి వచ్చిన ఏకలవ్యునికి విద్యను బోధించకపోవటం ద్వారా తప్పుచేసిన ద్రోణుడు, తనకు శిష్యుడు కాని ఏకలవ్యుని గురుదక్షిణ అడగటం మరొక తప్పుకాగా, వ్రేలిని కోసి ఇమ్మనటం మరీ అన్యాయంగా ఉంది. చేతనైతే అర్జునునికి ఇంకా గొప్పగా విద్యలు చెప్పుకోవచ్చుగాని ఏకలవ్యునికి అన్యాయం చేయటం ఏమి ధర్మం?

ఇది నిజంగా కావాలని చేసే, పైకవిగారి అడ్డదిడ్డమైన విమర్శలాంటిది కాదు. ఈ ఏకలవ్య గాథను విన్న ఎవరికైనా సాధారణంగా వచ్చే సందేహమే. కనుక ఇప్పుడీ విషయాన్ని చూద్దాం.

విద్యనర్థించి వచ్చిన ఏకలవ్యునికి విద్యను బోధించక పోవటం ద్రోణాచార్యుడు చేసిన తప్పిదమా? ఎందుకు శిష్యునిగా స్వీకరించటానికి నిరాకరించాడు? గ్రంథంలో ఒకే ఒక్క కారణం చెప్పబడింది. అది 'ఏకలవ్యుడు నిషాదుడు గనుక ధనుర్విద్యను నేర్పేందుకు ద్రోణుడు నిరాకరించాడు' అని.

ఏ విద్యను ఎవరికి బోధించాలో, ఎవరికి బోధించకూడదో కొన్ని నియమనిబంధనలుంటాయి. బ్రాహ్మణులకు, క్షత్రియులకు, రాజులవద్ద పనిచేసే రక్షకభటులు, సూతులు మొదలైనవారికి ధనుర్విద్య అవసరం. ఇతరులకు నేర్పేందుకు బ్రాహ్మణులకు, తమను తాము రక్షించుకుంటూ శత్రువులపై యుద్ధం చేయటానికి క్షత్రియులకు, విధినిర్వహణలో తమను తాము రక్షించుకొనేందుకు సూతులకు- ఇలా వీరందరికీ ధనుర్విద్య యొక్క అవసరం ఉంది. కాని అరణ్యాలలో జీవించే భిల్లులకు, నిషాదులకు క్రూరమృగములనుండి రక్షణకు, వేటాడటానికి కావలసిన విద్యలుమాత్రవేం చాలును. ద్రోణాచార్యుడు ధనుర్వేదాన్నే గాదు, దివ్యాస్త్రవిద్యలను బోధించే గురువు. కనుకనే అతడు ఏకలవ్యుని నిరాకరించాడు.

ఒకవేళ పక్షపాతబుద్ధితో విద్యను తిరస్కరించాడను కొందామా? అంటే అప్పటికి ఏకలవ్యునికి, ద్రోణునికి మధ్య ఎలాంటి శతృత్వమూ లేదు. అసలు పరిచయమే లేదు. పోనీ ద్రోణాచార్యుడు శతృమిత్రభేదం చూసి విద్యలు నేర్పేవాడా అంటే కాదు, పక్షపాతబుద్ధి కలవాడూ కాదు, స్వార్థపరుడూ కాదు. ఆయన కురుపాండవులకు మాత్రమే కాదు విద్యలు నేర్పింది, తనను సంహరించటానికే ద్రుపదుని యజ్ఞకుండం నుండి

దివ్యమైన రథంతోను, ధనుర్బాణాలతోను, కిరీటకవచాలతోను ఉద్భవించిన దృష్టద్యుమ్నునికి సకల శస్త్రాస్త్ర విద్యలు నేర్పాడు. భీష్ముని సంహరించటానికే పుట్టిన ద్రుపదుని మరియొక పుత్రుడు శిఖండికి కూడా సర్వవిద్యలూ నేర్పాడు. కనుక ద్రోణునిలో ఏ పక్షపాతబుద్ధీ లేదు. కేవలం అర్హతనుబట్టే విద్యలు నేర్పేవారు. కర్ణార్జునులిరువురికీ అన్ని అస్త్రశస్త్ర విద్యలు సమానంగానే నేర్పాడు. అయితే బ్రహ్మాస్త్రాన్నిమాత్రం అర్జునునికే ప్రసాదించాడు. అపుడు కర్ణుడు ఆచార్యుని సమీపించి "ఆచార్యా! తమరు శిష్యులపట్ల పక్షపాతబుద్ధిలేనివారుగా ఉండాలంటే నాకు కూడా బ్రహ్మాస్త్రాన్ని ప్రసాదించండి" అని అడిగాడు.

దానికి ద్రోణుడు, కర్ణా! బ్రహ్మాస్త్రాన్ని విధినిర్వహణలో నిలిచే బ్రాహ్మణునకు, తపస్సుచేసిన క్షత్రియునకు మాత్రమే ప్రసాదించాలి, అన్యులకు దీనిని ప్రసాదించరాదు" అని బ్రహ్మాస్త్ర నియమాలను తెలియజేయటంతో కర్ణుడు ద్రోణునికి నమస్కరించి వెళ్ళిపోయి, పరశురామునివద్ద బ్రాహ్మణుడనని అబద్ధమాడి బ్రహ్మాస్త్రాన్ని సంపాదించాడు. అంటే ప్రతివిద్యకు కొన్ని నియమాలు, నిబంధనలు ఉంటాయి.

ఈనాడు కూడా లెక్కల సబ్జక్టులో నూటికి నూరు మార్కులు వచ్చినా, ఎమ్.బి.బి.ఎస్.లో సీటివ్వరు. సైన్స్‌లో 98% మార్కులు వచ్చినా బి.ఇ.లో సీటివ్వరు. "బ్రాహ్మణ పుత్రుడో, వైశ్యకుమారుడో నాకు 80% మార్కులు వచ్చినా సీటివ్వలేదు, బి.సి. లేదా ఎస్.సి.కుర్రవానికి 55% మార్కులు వచ్చినా సీటిచ్చారు, నాకు న్యాయం చేయండీ" అని న్యాయస్థానానికి వెళ్తే చట్టప్రకారం అదే న్యాయం. నీకు ఆ కోర్సు చదివే అర్హత లేదని తీర్పుచెబుతుంది న్యాయస్థానం.

అలాగే ఆనాటి నియమనిబంధనలనుబట్టి ద్రోణాచార్యుడు ఏకలవ్యుని తిరస్కరించాడే గాని ఏకలవ్యుని పట్ల ద్వేషమూలేదు, శత్రుత్వమూ లేదు.

ఇక తాను విద్యను బోధించ నిరాకరించిన ద్రోణాచార్యుడు గురుదక్షిణ కోరటమేమిటి? అందునా వ్రేలును కోసివ్వమని కోరటం ఏమి న్యాయం? చూద్దాం.

అస్త్రవిద్యనుగాని, శస్త్ర(బాణ) విద్యనుగాని, ఎవరైనా సరే ఒక అనుభవజ్ఞుడైన, సర్వశస్త్రాస్త్రపారంగతుడైన గురువును ఆశ్రయించి, ఆ గురువుయొక్క ప్రత్యక్ష పర్యవేక్షణలోనే నేర్చుకోవాలి. అపుడే ఏ అస్త్రాన్ని లేదా శరాన్ని ఎలా ప్రయోగించాలో, ఏఏ సమయాల్లో ప్రయోగించాలో, ఎవరిపై ప్రయోగించాలో ఎవరిపై ప్రయోగించకూడదో కొన్ని జాగ్రత్తలను, విధినిషేధాలను ఆ గురువు శిష్యునికి తెలియజేస్తాడు.

ఉదాహరణకు-ద్రోణాచార్యుడు తన గురువైన అగ్నివేశుని ద్వారా పొందిన బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని అర్జునునికి ప్రదానం చేస్తూ, శిష్యునితో ఇలా అంటున్నాడు "అర్జునా! దీనిని నా గురుదేవుడు తన గురువైన అగస్త్యునినుండి పొందాడు. నేను తీవ్రమైన తపస్సు చేసి నా గురుదేవునినుండి నేను పొందాను. ఇపుడు దీనిని అన్ని అర్హతలు సంపాదించిన నీకు ప్రసాదిస్తున్నాను. ఇది అమోఘశక్తి గలది. వజ్రాయుధంతో సమానమైనది. సమస్త భూమండలాన్ని భస్మం చేయగల శక్తి గలది. దీనిని నాకు ప్రసాదిస్తూ నా గురుదేవుడు అగ్నివేశుడు నాతో ఇలా అన్నాడు, "దీనిని నీవు మనుష్యులపై ప్రయోగించ రాదు, మనుష్యేతరులైన యక్ష, దేవ, దానవ, కిన్నర, కింపురు షాదులలో కూడా అల్పులైనవారిపై ప్రయోగించరాదు" అని.

కనుక అర్జునా! నీవు కూడా ఈ నియమాలను తప్పక పాటించాలి"- అని చెప్పి బ్రహ్మశిరమనే అద్భుత అస్త్రాన్ని ప్రసాదించాడు. (ఆదిపర్వం 138 అ.9-13శ్లో) ఈ నియమా లుండబట్టే ఎంతటి విపత్కర పరిస్థితులెదురైనా, 18 రోజుల మహాభారతయుద్ధంలో, ఒక్కసారి కూడా అర్జునుడు ప్రయోగించలేదు ఈ అస్త్రాన్ని. సాక్షాత్తుగా గురువుయొక్క పర్యవేక్షణ లేనప్పుడు ఇలాంటి నియమ నిబంధనలుగాని, జాగ్రత్తలుగాని తెలియవు.

ఇక్కడ ఏకలవ్యుడు సాక్షాత్తుగా ద్రోణాచార్యునివద్ద విద్యలు నేర్చుకోలేదు. ద్రోణునియొక్క విగ్రహాన్ని మట్టితో తయారు చేసుకొని, ఆ ద్రోణాచార్యుని తన గురువుగా భావించి, ఆయనపై అత్యంత భక్తిశ్రద్ధలతో, గౌరవంతో, గొప్ప అభ్యాసబలంతో ధనుర్విద్యను నేర్చుకొన్నాడు. తన గురువే తనకు శిక్షణనిస్తున్న ట్లుగా భావిస్తూ ధనుర్విద్యాభ్యాసం చేశాడు. తత్ఫలితంగా అతడికి లోకోత్తరశక్తి లభించింది.

అయితే అతడికి లభించిన ఈ విద్యను, శక్తిని ఎపుడు, ఎవరిపై ఎలా ప్రయోగించాలో అనే శిక్షణమాత్రం లేదు. అందుకే తనకు లభించిన ఈ అపూర్వ, అద్భుత గాంధర్వ బాణప్రయోగ విద్యను అంటే ఒకేసారిగా ఏడుబాణాలను ఒక్కటిగా ప్రయోగించి, శత్రువులను నిరుత్తరులను చేసే ఈ విద్యను-

ఒక అల్పజీవియైన కుక్కపై ప్రయోగించాడు. ఇదే ద్రోణాచార్యుని దృష్టిలో అపరాధం. ఏకలవ్యుడలా చేస్తే ద్రోణాచార్యునికేమి అంటారా? ఇపుడిలా అల్పజీవిపై అద్భుత ప్రయోగం చేసిన ఏకలవ్యుడు రేపు ఎవరిపైనైనా, ఎట్టి అల్పునిపైనైనా, ఎట్టి అసందర్భపరిస్థితులలోనైనా తన విద్యలు ప్రయోగించవచ్చు. అలా ప్రయోగించినపుడు ఇట్టి అకార్యం చేసినదెవరు? అని లోకం విచారణ చేయవచ్చు. ఇలా చేసింది ద్రోణాచార్యుని శిష్యుడు ఏకలవ్యుడు అని తెలుస్తుంది. దానితో ద్రోణాచార్యునికి లోకంలో చెడ్డపేరు వస్తుంది. అదీ ఏకలవ్యుని వల్ల. అందుకే ఇట్టి విద్యలు అతడివద్ద ఉండరాదు. అయితే ఇదంతా అతడు తన శిష్యుడనని చెప్పుకుంటేనే. నేను నీ శిష్యుణ్ణి కాదు, నా స్వయంప్రతిభతో విద్యను నేర్చుకున్నానని ఏకలవ్య డంటే ద్రోణుడు గురుదక్షిణ అడగాల్సిన అవసరమూ లేదు, వ్రేలును కోసివ్వమని కోరే పనీలేదు. ఇంతటి అపకీర్తిని నెత్తికెత్తుకోవలసిన పరిస్థితీ దాపురించదు.

అందుకే ద్రోణుడు ఏకలవ్యునితో "యది శిష్యో2సి మే వీరవేతనం దీయతాం మమ" నీవు నా శిష్యుడవే అయితే నాకు గురుదక్షిణనివ్వాలి- అన్నాడు. అపుడైనా ఏకలవ్యుడు నీవు నాకు స్వయంగా విద్యలు నేర్పినావా? నేనే స్వయంగా విద్యలను నేర్చుకున్నాను. నాకు గురువెవరూ లేరు. నేను నిజంగా నీ శిష్యుడను కాదు - అని అన్నట్లైతే అసలు గురుదక్షిణ ప్రసక్తే ఉండేది కాదు. కాని ఏకలవ్యుడు అలా అనలేదు. ఎందుకంటే తనకు లభించిన విద్య తన స్వయంకృషివల్ల లభించినది కాదు, తన గురువు యొక్క కృపాకటాక్షం చేత లభించినదేననే దృఢ విశ్వాసంతో ఉన్నవాడు ఏకలవ్యుడు.

అందుకే నేను మీ శిష్యుడనే. నేను ఏమి ఇవ్వగలనో మీరే ఆజ్ఞాపించాలి. గురువున కివ్వదగనిది నా దగ్గర ఏమీ లేదు - అన్నాడు ఏకలవ్యుడు. ఏకలవ్యునివద్ద అట్టి లోకోత్తర విద్యలుండటం క్షేమకరం కాదు గనుక, అతణ్ణి అశక్తుణ్ణి చేయటానికే ద్రోణాచార్యుడు అతని కుడిచేతి బొటనవ్రేలిని కోరాడు. ఏకలవ్యుడు సంతోషంతో, వెనకాముందూ ఆలోచించకుండా, తన సత్యప్రతిజ్ఞకు కట్టుబడి వ్రేలిని కోసి ఇచ్చాడు.

కనుక ద్రోణుడు ఏకలవ్యునికి విద్యలు చెప్ప నిరాకరించటం లోనూ తప్పులేదు. గురుదక్షిణను కోరటంలోనూ తప్పులేదు. ఆ కోరటంలో ఏకలవ్యుని అశక్తుని చేయుటకై వ్రేలిని కోరటంలోనూ దోషంలేదు.

**ఎవరు సద్గుణములు కలిగి యుంటారో, ఎవరు సత్యాన్వేషణ సలుపుతూ ఉంటారో, పరమాత్మ వారి సన్నిధిని ఉంటాడు.**

ఏకలవ్యునికన్నా అధికంగా అర్జునునికి విద్యలు నేర్పేందుకు ద్రోణాచార్యునికి సమర్థత లేకపోలేదు. నిజంగా అర్జునుని సర్వశస్త్రాస్త్ర సంపన్నునిగా తీర్చిదిద్దాడు ద్రోణాచార్యుడు. తన పుత్రునికి కూడా ఇవ్వని కొన్ని అస్త్రాలను అర్జునునికి ప్రసాదించాడు. బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రయోగ ఉప సంహారాలతో సహా అర్జునునికి ఇచ్చి, తన కుమారుడు అశ్వత్థామకు మాత్రం ప్రయోగమే చెప్పి ఉపసంహారం చెప్పలేదు. 'పార్థ ఏవ ధనుర్ధరః' అనునట్లుగ తీర్చిదిద్దాడు. అందుకే మహాభారత యుద్ధ ప్రారంభంలో, ఉభయపక్షాలలోని వీరులను రథ-అతిరథ నిర్ణయం చేస్తూ భీష్ముడు, దుర్యోధనునితో 'రెండు పక్షాలలోను గల ఏకైకవీరుడు-అర్జునుడు' అని తెలియజేశాడు. దీనినిబట్టి ద్రోణాచార్యుడు ఏకలవ్యుని అలా అసాధారణ గురుదక్షిణను కోరటంలో గల ఆంతర్యమేమిటో తెలిసిపోతున్నది.

### విమర్శ (3)

ఏకలవ్యుని గాథను తెలుసుకొన్నవారు అతడిపై సాను భూతితో, "ఆ ఏకలవ్యుడు అమాయకుడు, తెలివితక్కువవాడు. అందుకే అడిగినదే తడవుగా ఆచార్య ద్రోణునికి తన వ్రేలిని కోసి ఇచ్చి పొరపాటు చేశాడు. అసలు తనకు విద్యలు బోధించని గురువుకు గురుదక్షిణ ఇవ్వాల్సిన పనేమిటి? అందునా తాను నేర్చుకొన్న విద్యమొత్తం వ్యర్థమైపోయేటట్లుగా వ్రేలిని కోసి ఇవ్వటమేమిటి?" అంటారు.

నిజమే ఏకలవ్యుని స్థానంలో ఎన్నో తెలివితేటలున్న మనలాంటివారెవరైనా ఉంటే - నా గురువు ద్రోణాచార్యుడే అని ఒకవేళ చెప్పుకున్నా, మీరేమి అడిగినా గురుదక్షిణగా ఇవ్వటానికి నేను సిద్ధమే అని ప్రతిజ్ఞ చేసి చెప్పినా ఇలాంటి గురుదక్షిణ అడగగానే ఖచ్చితంగా మన తెలివితేటలను ప్రదర్శించేవారమే "సరే గురుదేవా! నాకు విద్యలు నేర్పిన ఆ ద్రోణాచార్యుడు (మట్టిబొమ్మ) అడిగితే చాలు, వెంటనే ఇచ్చేస్తాను" అనేవారం. అలా అనటం తేలికే. కాని ఏకలవ్యుని

లాగా ఇచ్చిన మాటకు కట్టుబడి, చేసిన ప్రతిజ్ఞను ఎంతో సంతోషంతో, ఒక్కక్షణం కూడా వెనుకా ముందూ ఆలోచించ కుండా నెరవేర్చి, చరిత్రలో, ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోవటం సాధ్యమౌతుందా? ఏకలవ్యుడు అమాయకుడని, తెలివితక్కువవాడని మనం అనుకోవచ్చు.

కాని, ఇచ్చిన మాటను నిలబెట్టుకొనుటకై ఎంతటి త్యాగానికైనా వెనుదీయని మహాత్ములు, మహాపురుషులు, సత్యవాక్పాలకులైన చక్రవర్తుల సరసన ధీటుగా నిలిచిపోయాడు. ఇదే ఏకలవ్యుని త్యాగశీలత, మేరునగధీరత్వం.

ఏదైనా ఒక ప్రతిజ్ఞను చేసినప్పుడు ఎన్ని కష్టాలు, నష్టాలు ఎదురైనా, ఎటువంటి విపత్కర పరిస్థితులెదురైనా, ఎట్టి విపరీత పరిణామాలెదురైనా మహాత్ములైనవారు, సత్పురుషులనదగిన వారు తమ చేసిన ప్రతిజ్ఞను నిలబెట్టుకొనేందుకు ఏమాత్రం వెనుకాడరు.

"నీవు కోరినంత ధనాన్ని ఇస్తాను కోరుకో" అని హరిశ్చంద్రుడు విశ్వామిత్రునికి ఇచ్చిన మాటను నిలబెట్టు కొనేందుకే రాజ్యాన్ని, సంపదలను పోగొట్టుకొని, భార్యాబిడ్డలను నడిబజారులో అమ్ముకొని, చివరకు తనకు తానుగా అమ్ముడైపోయి, కాటికాపరి వృత్తిని చేపట్టాడు. సత్య హరిశ్చంద్రుడుగా చిరస్థాయిగా నిలిచిపోయాడు.

ఆడిన మాటను తప్పకుండా ఉండేందుకే, కైకేయికి ఎప్పుడో ఇచ్చిన వరం ప్రకారం, దశరథుడు, తన ప్రాణం కన్నా మిన్నగా చూసుకొనే శ్రీరామచంద్రుని వనవాసానికి పంపి, ఆ వియోగదుఃఖంతో తన ప్రాణాలను సహితం వదిలేసి ప్రతిజ్ఞా పాలనకు కట్టుబడ్డాడు.

ఆడినమాటను తప్పకుండా ఉండేందుకే శిబిచక్రవర్తి డేగకు తన శరీరం నుండి మాంసాన్ని కోసి ఇచ్చి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాడు.

ఆడినమాటను తప్పకుండా ఉండేందుకే బలిచక్రవర్తి తన రాజ్యాన్ని, సర్వస్వాన్ని విడిచిపెట్టి వామనుని చేత పాతాళానికి నెట్టివేయబడ్డాడు.

ఆడినమాటను తప్పకుండా ఉండేందుకే దధీచిమహర్షి తన వెన్నెముకను దేవేంద్రునికి ఇచ్చి ప్రాణాలు విడిచిపెట్టాడు.

ఆడినమాటను తప్పకుండా ఉండేందుకే భీష్ముడు ఆజన్మ బ్రహ్మచర్యవ్రతసంపన్నుడై, తన కళ్ళముందే కురురాజ్యానికి చక్రవర్తులైన చిత్రాంగద, విచిత్రవీర్యులు మరణించినా, తల్లి సత్యవతి కోరినా, వివాహం చేసుకోలేదు, రాజ్యసింహాసనాన్ని అధిష్ఠించలేదు.

అలాగే ఆడినమాట తప్పకుండా ఉండేందుకే ఏకలవ్యుడు ద్రోణాచార్యునికి గురుదక్షిణగా తన కుడిచేతి బొటనవ్రేలిని సంతోషంతో కోసి ఇచ్చాడు. పైన చెప్పిన హరిశ్చంద్ర, శిబి, బలిచక్రవర్తుల సరసన, దధీచివంటి మహర్షుల సరసన స్థానం సంపాదించుకున్నాడు. అమాయకుడు, తెలివితక్కువవాడు అని మనచేత భావించబడే ఏకలవ్యుడు.

ఇచ్చిన మాటలను గురించి ఏమాత్రం పట్టించుకోకుండా మరచిపోయే ఈనాటి స్వార్థపరులైన మానవులకు ఏకలవ్యుని త్యాగం, మహిమ తెలివితక్కువగా కనిపించవచ్చు. ఇదంతా ఏకలవ్యునిపై సానుభూతివల్లనే కావచ్చు. కాని ఏకలవ్యుడు మహాపురుషుడని, గొప్పత్యాగియని అనిపించుకున్నాడు.

ఇక ఈనాటి సినిమాలలో చూపించినట్లు ఏకలవ్యుని చెల్లెలు కర్ణుని భార్య అనో, కర్ణుని చెల్లెలు ఏకలవ్యుని భార్య అనో, ఏకలవ్యుడు దుర్యోధనుని స్నేహితుడనో, ఇంకా ఇలాంటి ఏవేవో కట్టుకథలన్నీ అభూతకల్పనలు, గ్రంథవిరుద్ధాలు. అవన్నీ కవుల మనస్సులో పుట్టిన భావాలే. అలాగే ఏకలవ్యుడు దుష్టుడని గాని, జరాసంధుని సేనాని అనిగాని మహాభారతంలో ఎక్కడా లేదు. అతడు కేవలం ఆటవికుడైన భిల్లుడు మాత్రమే.

ఇక ఈ విమర్శల - ప్రతివిమర్శల గొడవను ప్రక్కన బెట్టి, ఏ ఉద్దేశంతో వ్యాసమహర్షి ఈ ఏకలవ్య వృత్తాంతాన్ని చెప్పటం జరిగిందో, ఈ ఏకలవ్య వృత్తాంతం ద్వారా సర్వ మానవులు ఏ జీవన సత్యాలను, నీతిని గ్రహించాలని వ్యాసమహర్షి తలచి ఉంటాడో, వేటిని తెలుసుకోవటంవల్ల మన జీవనవిధానం శ్రేష్ఠమైనదవుతుందో తెలుసుకుందాం.

(వచ్చే సంచికలో)

**ధన కనక వస్తు వాహనాలు - కరిగిపోయే మంచువంటివి ఇవి కరుగక మునుపే మంచి కార్యాలు చేసి శాంతిని పొందాలి.**

**దయకంటే మించిన ధర్మం ఎక్కడుంది? దయగల హృదయమే దైవమందిరం.**



# మహాభారతం 8

## ఏకలవ్యుని గాథ-జీవనసత్యాలు

రచన:
మహాభారత పరిశోధకులు
'జ్ఞానప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు B.Sc. (Ag)
వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట.
ఫోన్ : 08647 254716.

(గత సంచిక తరువాయి)

### ఏకలవ్యగాథ నుండి గ్రహించవలసిన జీవనసత్యాలు

మహాభారతాన్ని కురుపాండవుల కథగా గాక మన కథగా, మానవజీవిత కథగా చూడాలని ఇంతకు ముందే చెప్పటం జరిగింది. ఇక్కడ ద్రోణాచార్యునిది తప్పా? అర్జునునిది తప్పా? ఏకలవ్యునిది తప్పా? అని పరిశీలన చేసి ఏదో ఒకటి తేల్చివేస్తే మనకు కలిగే ప్రయోజనం ఏమీ ఉండదు. మరి మనం ఏం చేయాలి? ఈ గాథ నుండి మనం ఏమి గ్రహించాలి? ఇందులోని ధర్మసూక్ష్మాలేమిటి? నీతి ఏమిటి? అని ఆలోచించి, వాటిని గ్రహించి, మన జీవితాలను వాటికి అనుగుణంగా మలచుకున్నప్పుడే మనకు ప్రయోజనం కలుగుతుంది. అలా మనం తెలుసుకొని ధర్మబద్ధమైన జీవితం గడపటానికే, వ్యాసమహర్షి ఎన్నో జీవన సత్యాలను ఇలాంటి గాథల ద్వారా, ఉపాఖ్యానాల ద్వారా మహాభారతంలో తెలియ జేయటం జరిగింది. కనుక ఈ విమర్శల గోలను ప్రక్కన బెట్టి ఏకలవ్య గాథ నుండి గ్రహించవలసిన జీవనసత్యాలేమిటో తెలుసుకుందాం. ఏ ఉద్దేశంతో వ్యాసమహర్షి మనకీగాథను అందించాడో తెలుసుకుందాం.

**1) విగ్రహారాధనలోని విశిష్టత** : ఏకలవ్యుడు పూజించినది, ఆరాధించినది సాక్షాత్ ద్రోణుని కాదు, తనకు విద్యలు నేర్ప నిరాకరించిన ద్రోణవిగ్రహాన్ని . ఐతే ఆ విగ్రహాన్ని కేవలం మట్టి విగ్రహంగా గాక సాక్షాత్ ద్రోణాచార్యుడేనని భావించి, ఆయనే తనకు విద్యాబోధన చేస్తున్నట్లు, ఆయన ఆదేశాల ప్రకారమే తాను అభ్యాసం చేస్తున్నట్లు విశ్వాసంతో ఉన్నవాడు. దానివల్ల అతడికి అద్భుతమైన విద్య అలవడింది. దీనిని బట్టి విగ్రహారాధనలోని విశిష్టత ఏమిటో తెలుస్తున్నది. మనం ఏ విగ్రహాన్ని లేదా ఏ రూపాన్ని పూజించినా అది అట్టముక్కగానో, మట్టిబొమ్మగానో గాక, దానిని సాక్షాత్ భగవంతుడే అని విశ్వసించినపుడు మనం చేసే ప్రార్థన, పూజ లేదా ఆరాధన ఆ భగవంతునికే చేరుతుంది. నిరాకార పరమాత్మను సాధారణ పద్ధతులలో పూజించటానికి వీలులేదు గనుక, ఆ స్థాయినందు కునే వరకు ఇలా విగ్రహారాధన చేయాలి.

**2) అనన్యభక్తి**: ద్రోణాచార్యుడు తనకు విద్యను బోధించ నిరాకరించినా, ఆయననే తన గురువుగా భావించి అనన్య భక్తితో, అచంచలమైన విశ్వాసంతో ఆరాధించాడు. తత్ఫలితంగా అద్భుత విద్యను గ్రహించాడు. దీనినిబట్టి మనం భగవంతుని పూజించేటప్పుడు, ఆరాధించేటప్పుడు మన కోర్కెలు తీర్చక పోయినా మనకు భగవంతునిపట్ల అనన్యమైన భక్తి ఉండాలి. దృఢమైన విశ్వాసం ఉండాలి. ఇతర ఏ ప్రాపంచిక విషయాల మీదా దృష్టి లేకుండా కేవలం భగవంతునిపైనే మనస్సు నిలపాలి. సంపూర్ణశరణాగతి చెందాలి. భగవంతుడున్నాడని, అతడు తప్పక నన్ను అనుగ్రహిస్తాడని విశ్వాసం ఉండాలి. అప్పుడే భగవంతుని అనుగ్రహం లభిస్తుంది.

**3) గురువుపై శ్రద్ధ**: ఏకలవ్యుడు ద్రోణ విగ్రహాన్ని ముందు పెట్టుకొని చేసిన సాధన వల్ల గొప్ప విద్య లభించింది. ఆ లభించిన విద్య తన గురువు యొక్క కృపాకటాక్షం చేతనే

లభించినదనే విశ్వాసాన్ని వ్యక్తం చేశాడు. అందుకే ద్రోణాచార్యుడు, **'యదిశిష్యోఽసిమే వీర వేతనం దీయతాం మమ'** నీవు నా శిష్యుడవే అయితే నాకు గురుదక్షిణ ఇవ్వాలి- అనగా నేను మీ శిష్యుడనే. నేను ఏమి ఇవ్వగలనో మీరే ఆజ్ఞాపించండి అన్నాడు ఏకలవ్యుడు. దీనిని బట్టి ఏ శిష్యుడైనా, ఎంతటి గొప్ప విద్యలు నేర్చుకున్నా, 'ఈ విద్యలన్నింటిని నా తెలివి తేటలతో కష్టపడి నేర్చుకున్నాను' అని అహంకరించక, 'నా గురుదేవుల అనుగ్రహం వల్లనే నేను ఈ విద్యలను నేర్చుకో గలిగాను' అనే దృఢవిశ్వాసం ఉండాలి. ఇదంతా నా గురుదేవుల ప్రసాదమే అని నమ్మాలి. ఇదే గురువుల పట్ల శిష్యుల కుండవలసిన శ్రద్ధ (విశ్వాసం).



**4)** తనకు విద్యలు బోధించ నిరాక రించిన గురువును ఏకలవ్యుడు ఏ విధంగా గౌరవించాడో, పూజించాడో గ్రహించి, తమకు ఉన్నతమైన విద్యలను బోధించి, సమాజంలో గొప్ప స్థానాన్ని కల్పించిన గురువులను; అలాగే తమ అర్హతలను కూడా పట్టించు కోకుండా, జన్మకు సార్థకత కలిగించే విద్యలను-ఆత్మజ్ఞానాన్ని బోధించి మోక్షమార్గాన్ని చూపే సద్గురువులను ఏ విధంగా గౌరవించాలో, సత్కరించాలో, పూజించాలో, సేవించాలో వివేకంతో గ్రహించి నడుచుకోవాలి.

**5)** అస్త్ర, శస్త్ర విద్యలైనా, ఆధ్యాత్మిక, యోగవిద్యలైనా ఒక సమర్థు డైన సద్గురువు యొక్క ప్రత్యక్ష పర్యవేక్షణలోనే నేర్చుకోవాలి. అప్పుడే ఆ విద్యలను ఎప్పుడు, ఎక్కడ, ఎలా, ఏ సందర్భాలలో ఉపయోగించుకోవాలో, విధినిషేధాలేమిటో, తీసుకోవలసిన జాగ్రత్తలేమిటో తెలుస్తుంది. సర్వసందేహాలు తొలగిపోతాయి. ఏ దోషాలు దొర్లవు.

**6)** ఎన్ని కష్టాలు నష్టాలు ఎదురైనా, ఎటువంటి విపత్కర పరిస్థితులు తటస్థించినా, ఎలాంటి విపరీత పరిణామాలు ఎదురైనా, చివరకు ప్రాణాపాయం తటస్థించినా, ఇచ్చిన మాటను- చేసిన ప్రతిజ్ఞను నిలబెట్టుకున్న వారే మహాత్ములు, మహానుభావులు, సత్పురుషులుగా పరిగణింపబడతారు అనే విషయాన్ని గ్రహించాలి. ఏకలవ్యుడు అలా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవటం ద్వారా చక్రవర్తులైన శిబి, బలి, హరిశ్చంద్రుడు మొదలైనవారి సరసన స్థానాన్ని సంపాదించాడనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

**7)** ఏ కులంలో లేదా ఏ మతంలో జన్మించిన వాడైనా సరే, అతడికి ఎన్ని కష్టనష్టాలకోర్చియైనా సరే 'నేర్చుకోవాలి' అనే తపన ఉంటే, పట్టుదల ఉంటే, అచంచలమైన శ్రద్ధ ఉంటే, ఎలాంటి విద్యలనైనా సరే నేర్చుకోగలడు- అనే విషయం ఈ ఏకలవ్యునిగాథ ద్వారా మనం గ్రహించ వచ్చు.

**8)** గురువులకు గురుదక్షిణ సమర్పించే టప్పుడు శిష్యుని మనో ప్రవృత్తి ఎలా ఉండాలో కూడా ఈ ఏకలవ్యగాథ నుండి నేర్చుకోవాలి. గురువు గురు దక్షిణగా నీ కుడిచేతి బొటనవ్రేలును ఇవ్వమని అడిగినప్పుడు, పూర్వంలాగే ప్రసన్న చిత్తంతోను, అత్యంత ఉదార స్వభావం తోను, ఏమాత్రం ముందు వెనుకలు ఆలోచించకుండా, భవిష్యత్ పరిణామా లను గురించి ఆలోచించకుండా, ఎంతో సంతోషంతో, తన జన్మధన్యమైనట్లు భావిస్తూ వ్రేలిని కోసి ఇచ్చాడు ఏకలవ్యుడు. ఇదే నిజమైన శిష్యులు నేర్చుకోవలసింది.

తన గురువు ద్రోణాచార్యునికి హృదయ శల్యంగా వేధిస్తున్న అవమానానికి ప్రతీకారంగా, గురువుయొక్క కోరికపై, తన పరాక్రమంతో ద్రుపదుని యుద్ధభూమిలో జయించి, బంధించి, గురుదక్షిణగా తన గురువు పాదాలపై పడవేశాడు అర్జునుడు. అలా గురువును సంతృప్తి పరచాడు.

ఏకలవ్యుడు తన గురువుయొక్క కోరికపై తన శరీరంలో భాగమైన వ్రేలిని కోసి ఇచ్చి గొప్పత్యాగంతో తన గురువును సంతృప్తి పరచాడు.

ఇక స్వయంగా భగవానుడే అయిన శ్రీకృష్ణుడు తన గురువు సాందీపనిమహర్షి కోరకుండానే, ఆయన యొక్క మరణించిన పుత్రుని సజీవునిగా చేసి, గురుదక్షిణగా సమర్పించి, గురుదేవులను, గురుపత్నిని అఖండ ఆనందసాగరంలో ఓలలాడించాడు. ఐతే ఇలాంటి గురుదక్షిణ మానవమాత్రులకు సాధ్యం కాదు. కాకపోతే గురువులను సంతృప్తిపరచే గురుదక్షిణలను

ఎంతో సంతోషంతోను, త్యాగబుద్ధితోను సమర్పించాలి-అని మనం గ్రహించాలి.

ఈ విధంగా ఏకలవ్యుని చరిత్ర నుండి ధర్మసూక్ష్మాలను, జీవన సత్యాలను గ్రహించి మానవుడు తన జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలి. ముఖ్యంగా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవటం ఎంత గొప్ప విషయమో మనం గ్రహించాలి.

ఇక మరొక అంశాన్ని అందుకుందాం.

## నియోగపద్ధతి - దేవరన్యాయము

ధృతరాష్ట్ర, పాండురాజ, విదురుల జన్మ వృత్తాంతాన్ని బట్టి లోకంలో అనేక విమర్శలు, సందేహాలు, అపార్థాలు ఉన్నాయి. గొప్ప ధర్మహాని జరిగిపోయిందనే అభిప్రాయం చాలా మందిలో ఉంటుంది. ఏమిటది?

రామాయణకాలంలో ఉన్న పవిత్రత మహాభారతకాలం నాటికి లేకుండా పోయిందని; విచిత్రవీర్యుని భార్యలు అంబిక, అంబాలికలు భర్త మరణానంతరం వేదవ్యాసుని ద్వారా సంతానాన్ని కనటం ఎంత అపవిత్రం? ఎంత అసహ్యకరం? ఎంత అధర్మం? అనీ; పైగా దీనిని సత్యవతియే ప్రోత్సహించటం, భీష్ముడు అందుకు వంతపాడటం ఎంతటి అసమంజసం? ఎంతటి అకార్యం? ఎంతటి అవినీతి? అనీ; అసలు వేదవ్యాస మహర్షి ఇందుకు అంగీకరించటం ఏమిటి? పైగా దీనిని మహా భారత గ్రంథంలో గొప్ప ఘనకార్యంగా వ్రాసుకోవటం ఏమిటి? అసలు అలా వ్రాసుకోవటానికి వ్యాసునికి సిగ్గులేదా? - అనీ లోకంలో ఎందరో విమర్శించారు, అలా విమర్శిస్తూనే ఉన్నారు. అలా పైకి విమర్శించలేని వారు లోలోపల అనుకుంటూనే ఉంటారు. ఈ అపోహలు, అపార్థాలు, సందేహాలు తీరాలంటే, విమర్శలకు సరియైన సమాధానాలు కావాలంటే ముందుగా ఈ ఘట్టానికి సంబంధించి మూలభారతంలో వ్యాసమహర్షి ఏమి చెప్పాడో తెలుసుకొని ఆ తరువాత విశ్లేషణ చేద్దాం. ఈనాటి సామాజిక పరిస్థితితో పోల్చుకొని ఆనాటి గాథలను విమర్శించటం గాక, ఆనాటి గాథలను బట్టి ఆనాటి సామాజిక పరిస్థితులు ఎలా ఉండేవో; అప్పటి ఆచారవ్యవహారాలు ఇపుడెందుకు పాటించబడుటలేదో తెలుసుకుందాం.

హస్తినాపుర సామ్రాజ్యాన్ని శంతన మహారాజు పాలిస్తు న్నాడు. ఆ శంతనునికి గంగాదేవి వలన జన్మించిన అష్టమ సంతానమే దేవవ్రతుడు. శంతనుని పుత్రుడు గనుక శాంతనవుడని, గంగాదేవికి జన్మించినందున గాంగేయుడని పిలువబడుతున్నాడు. అతడే భీష్మమైన ప్రతిజ్ఞ చేసినందున 'భీష్ముడు' అనే పేరుతో సుప్రసిద్ధుడైనాడు. సుగుణశీలి, ఆచార వంతుడు, సర్వశస్త్రాస్త్ర సంపన్నుడు, మహాపరాక్రమశాలి ఐన దేవవ్రతుని (భీష్ముని) యువరాజుగా పట్టాభిషిక్తుని చేశాడు శంతన మహారాజు.

శంతన మహారాజు ఒకనాడు యమునా నదీతీరంలో విహరిస్తూ నావ నడుపుతున్న సత్యవతిని చూశాడు. ఆమెను వివాహం చేసుకోవాలని భావించి, ఆమె తండ్రి దాశరాజు వద్దకు వెళ్ళి, ఆమెను తనకిచ్చి వివాహం జరిపించమని కోరాడు. దాశరాజు అందుకు ఒక షరతు విధించాడు- 'ఆమెకు కలిగే కుమారుడే కురుసామ్రాజ్యానికి పట్టాభిషిక్తుడు కావాలి' అని. భీష్మునికి అన్యాయం చేయటం ఇష్టంలేక, విచారవదనంతో తిరిగి వస్తాడు శంతనుడు. తిరిగి వచ్చాడే కాని ఆయన మనస్సు మనస్సులో లేదు. తండ్రి విచారగ్రస్థుడు కావటానికి కారణ మేమిటి? అని విచారణ చేస్తూ భీష్ముడు శంతనమహారాజు సారథి ద్వారా విషయం తెలుసుకొని, మంత్రులను, బ్రాహ్మణు లను వెంటపెట్టుకొని, దాశరాజు వద్దకు వెళ్ళాడు, దాశరాజు కోరిక ప్రకారం సత్యవతి కుమారుడే కురు సామ్రాజ్యానికి ఉత్తరాధికారి కాగలడని, తాను వివాహం చేసుకొనకుండగ, ఆజన్మబ్రహ్మచర్యవ్రత సంపన్నుడనై యుండ గలనని గొప్ప ప్రతిజ్ఞ చేస్తాడు. ఆ తరువాత సత్యవతీ శంతనుల వివాహం జరిగింది. కొంతకాలానికి సత్యవతికి చిత్రాంగదుడనే పుత్రుడు కలిగాడు. ఆ తరువాత మరొక పుత్రుడు విచిత్రవీర్యుడు జన్మించాడు. ఇద్దరు బిడ్డలు పుట్టినతర్వాత శంతనుడు మరణించటంతో, చిత్రాంగదుని కురుసామ్రాజ్యానికి పట్టాభిషిక్తుని చేశాడు భీష్ముడు.

చిత్రాంగదుడు తానే గొప్ప బలవంతుడనని విర్రవీగేవాడు. ఒకసారి చిత్రాంగదుడనే గంధర్వరాజు వచ్చి, "చిత్రాంగదా! నీవు నా పేరు పెట్టుకున్నావు, నీ పేరైనా తొలగించుకో లేదా నాతో యుద్ధం చెయ్యి" అని పలుకగా, సరస్వతీ నదీతీరంలో ఇద్దరు చిత్రాంగదులు యుద్ధానికి సిద్ధమయ్యారు. 3 సంవత్సరాల తరువాత గంధర్వచిత్రాంగదుడు కురురాజు చిత్రాంగదుని వధించి గంధర్వ లోకానికి వెళ్ళిపోయాడు.

ఆ తరువాత విచిత్రవీర్యుని కురురాజ్యాభిషిక్తుని చేశాడు భీష్ముడు. అతడికి యుక్తవయస్సు రాగానే కాశీరాజపుత్రికలు అంబిక, అంబాలికలను ఇచ్చి వివాహం జరిపించాడు భీష్ముడు. సౌందర్యవంతులైన అంబిక, అంబాలికలతో నిరంతర కామోప భోగాలను అనుభవిస్తూ విచిత్రవీర్యుడు, రాజయక్ష్మ (క్షయ)

వ్యాధి పీడితుడై పుత్రులు లేకుండానే మరణించాడు. తల్లి సత్యవతి ఆజ్ఞానుసారం భీష్ముడు, శాస్త్రవిధిని అనుసరించి విచిత్ర వీర్యునికి అంత్యక్రియలు జరిపించాడు. ఇంతవరకు సంక్షిప్తంగా పూర్వగాథ.

ఇక పుత్రసంతానం కొరకు జరిగిన సంభాషణల గురించి మహాభారతం 103వ అధ్యాయం నుండి ఏమి చెప్పబడి ఉందో చూద్దాం.

## సత్యవతి భీష్మునితో ఆలోచించుట

అపుత్రకుడుగా మరణించిన విచిత్రవీర్యుని తలచుకొని కుమిలిపోతున్న సత్యవతి ఒకనాడు భీష్ముని చేరబిలిచి, "కుమారా! నీ తండ్రి వంశ కీర్తి ప్రతిష్టలు, కురువంశ రక్షణ భారము అన్నీ నీపైనే ఆధారపడి ఉన్నాయి. నీవు వేదవేదాంగాలు ఎరిగిన వాడవు. ధర్మశాస్త్రాలను అధ్యయనం చేసినవాడవు. నీ ధర్మనిష్ఠ, కులోచిత సదాచార సంపన్నత నాకు తెలుసు. క్లిష్టమైన సమయాలలో శుక్రాచార్యునిలాగా, బృహస్పతిలాగా నీ బుద్ధి కౌశలం అసమానంగా అలరారుతుంది. నాయనా! ధర్మాత్ములలో శ్రేష్ఠుడవైన నిన్ను నేనొక ముఖ్యకార్యంలో నియోగించాలను కుంటున్నాను. ముందు నేను చెప్పే విషయం విను. ఆ తర్వాత దానిని ఆచరించు.

"కుమారా! నాకు ప్రాణ సమానుడైన ప్రియపుత్రుడు, నీ ప్రియసోదరుడు విచిత్రవీర్యుడు పుత్రులు లేకుండానే మరణించాడు. అతడి భార్యలైన అంబిక, అంబాలికలు నవ యవ్వనంలో ఉన్నారు. వారి మనస్సులలో పుత్రులను పొందాలనే కోరిక ఉన్నది. మనకులం ఇంతటితో అంతమై పోకుండా, నిరంతరాయంగా కొనసాగటానికి వీలుగా నా నియోగంతో (మన్నియోగాత్) ఈ ఇద్దరియందు నీవు పుత్రదానం చేయాలి. నా ఆజ్ఞపై ఈ ధర్మకార్యాన్ని నీవు తప్పక చేయాలి. అంతేగాదు, నీవు రాజ్యాభిషేకం చేసుకొని ప్రజాపాలనం సాగించు. ధర్మాన్ని అనుసరించి నీవు వివాహం చేసుకొని పితరులకు ఉత్తమగతులు కలిగించు" అన్నది.

ఇది విని భీష్ముడు, "తల్లీ! నీవు చెప్పినదంతా ధర్మయుక్తమే. అందులో ఏమాత్రం సందేహం లేదు. కాని నేను రాజ్య లోభంతో అభిషిక్తుణ్ణి కాలేను. అలాగే స్త్రీ సాంగత్యాన్ని పెట్టుకోలేను. సంతానాన్ని పొందే విషయంలోను, రాజ్యాన్ని గ్రహించే విషయంలోనూ, నీ వివాహ సమయంలో ఏ కఠోర ప్రతిజ్ఞనైతే చేశానో, అది నీకు పూర్తిగ తెలుసు. ఆ ప్రతిజ్ఞను నేను మీర జాలను. నేను ధర్మమార్గాన్ని వీడటం అసంభవం" అన్నాడు భీష్ముడు.

**పాండవుల దృష్టిలో First God, Next world-last 'I'**
**కౌరవుల దృష్టిలో First I, next world, last God**
**కనుకనే అన్నిటియందు వారు lost అయిపోయినారు.**

అందుకు సత్యవతి, "నాయనా! నీ ప్రతిజ్ఞా విషయం నాకు తెలియనిది కాదు. నీవు ధర్మాన్ని తప్పవనీ నాకు తెలుసు. అయినప్పటికీ వంశాన్ని నిలబెట్టడానికి ఆపద్ధర్మాన్ని పాటించక తప్పదు గదా!" అన్నది సత్యవతి.

దానికి భీష్ముడు, "అమ్మా! ధర్మంవైపుకు దృష్టి మళ్ళించు. క్షత్రియుడెన్నడూ ధర్మం నుండి వైదొలగరాదు. ధర్మహాని కలుగ కుండా శంతనుని వంశపరంపర కొనసాగే ఉపాయాన్ని చెబుతాను. అది ధర్మయుతమైనది, సనాతనమైన క్షత్రియ ధర్మం కూడా. ఆపద్ధర్మ నిర్ణయాలలో నిపుణులైన విద్వాంసుల ద్వారా విన్నటువంటిది, లోకాచార వ్యవహారాలకు అనుగుణమైనదీ అయిన ఈ ఉపాయాన్ని గురించి విని ఆపై నిర్ణయించు" అన్నాడు భీష్ముడు. (ఆదిపర్వం 103వ అధ్యాయం)

"అమ్మా! భరతవంశ సంతాన పరంపర వృద్ధి చెందటానికి గల ఉపాయమేమంటే **గుణవంతుడైన** బ్రాహ్మణునికి ధనమిచ్చి నియోగించినట్లైన అతడు విచిత్రవీర్యక్షేత్రములందు సంతానాన్ని ప్రసాదించగలడు. ఇది పురాతన కాలం నుండి అమలులో ఉన్న ఆపద్ధర్మ ఉపాయమే. పూర్వం పరశురాముడు క్షత్రియ జాతిని నిర్వీర్యం చేసినప్పుడు, ఈ నియోగవిధిని పాటించటం చేతనే క్షత్రియకాంతలు సంతానవంతులై క్షత్రియజాతి కొన సాగింది. కనుక నీవు బాగా ఆలోచించి నిర్ణయం తీసుకో" అన్నాడు భీష్ముడు.

"**నాయనా! నీవు చెప్పినది ధర్మసమ్మతమే. ఆచారంలో ఉన్నదే. ఇప్పుడు మనం ఆచరించదగినదే.** ఈ సమయంలో నేను నీకొక విషయం తెలియజేయాలి - అని తాను కన్యగా ఉన్నప్పుడు పరాశరమహర్షి వల్ల తన కన్యాత్వం దూషితం కాకుండా వ్యాసమహర్షికి జన్మనిచ్చిన విషయం, అతడు అప్పటి కప్పుడే జన్మించి, పెద్దవాడై తపస్సుకు వెళ్తూ తాను ఎప్పుడు స్మరిస్తే అప్పుడు వచ్చి కోరిన కార్యం నెరవేర్చగలనని మాట ఇచ్చిన విషయం చెప్పి, నీ ఇష్టమైతే అతణ్ణి ఆహ్వానిస్తాను. అతడు మన కోరికపై నీ సోదరుని క్షేత్రములందు సంతానాన్ని ప్రసాదించగలడు" అన్నది సత్యవతి.

(వచ్చే సంచికలో)